నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 కరీంనగర్, మంగళవారం 31 డిసెంబర్ 2024 JAGTIAL

## కూలీ రేట్ల పెంపు కోసం హమాలీల నిరసన


నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

గోదావరిఖని, డిసెంబర్ 30: కూలి రేట్లు పెంచాలని గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎంఏ గౌస్ మాట్లాడుతూ, కూలి రేట్ల ఒప్పందం ముగిసినా హోల్ సేల్ వ్యాపారులు కూలిరేట్లను పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే కూలీరేట్లు పెంచాలని, లేకుంటే మార్కెట్‌ను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, గడ్డం రాంచందర్, గాలిపెల్లి సతీశ్, ఎండి జామియా, కౌటం రవీందర్ ఉన్నారు.

# రైతు నెత్తిన డీఏపీ పిడుగు?



### కొత్త ఏడాది నుంచి ధరలు పెరిగే అవకాశం

- 50 కిలోల బ్యాగుపై ₹300కు పైగా వడ్డన!
- ఉమ్మడి జిల్లా రైతులపై ₹78 నుంచి ₹80 కోట్ల వరకు భారం
- రైతు భరోసా లేదు.. బోనస్ రాదు..
- నిన్న విత్తనాల ధరలు.. నేడు డీఏపీ ధరల పెంపా..?
- ఆందోళనలో రైతులు



**కాంగ్రెస్ ఏడాది పాలనలో ఆగమైన అన్నదాత నెత్తిన మరో పిడుగు పడబోతున్నది. కొత్త సంవత్సరం నుంచి డీఏపీ ధరలు పెరిగే అవకాశం కనిపిస్తున్నది. 50 కిలోల బ్యాగుపై ₹300కుపైగా పెరుగుతుందని అధికారులు చెబుతుండగా, తమపై పెనుభారం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ సర్కారు ఏ ముహూర్తంలో వచ్చిందో ఏందో కానీ, మమ్మల్ని మాత్రం సంపుకతింటుందని భగ్గుమంటున్నారు. రైతుభరోసా లేదని, వరికి బోనస్ బోగస్ అయిందని, రుణమాఫీ అరకొర ముచ్చటేనని, విత్తనాల ధరలు పెరిగాయని వాపోతున్నారు. ఇప్పుడు డీఏపీ ధర కూడా పెంచుతరట అని మండిపడుతున్నారు. ఇలా అయితే ఎవుసం ఎలా చేసేదని ప్రశ్నిస్తున్నారు.**

జగిత్యాల, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : 'రైతులకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నాం. రైతు రుణమాఫీ చేశాం' అని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. రెండు సీజన్ల నుంచి రైతులకు ఇచ్చే రైతుబంధు నిలిచిపోయింది. ₹రెండు లక్షల రుణమాఫీ 40 శాతం మందికి కూడా వర్తించలేదంటూ రైతులు నిత్యం ఏదో ఒక్కచోట తమ నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అలాగే, వరి క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇస్తామని చెప్పి తీరా వానకాలం పంట చేతికి వచ్చే సమయంలో సన్నాలకు మాత్రమే అని చెప్పడంతో హతాశులయ్యారు. ఇప్పటికే ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతులతో దిగాలుపడిన రైతులకు విత్తనాల ధర పెంపు మరింత ఆవేదనకు గురి చేసింది. తాజాగా, డీఏపీ ధరలు పెరుగుతాయని అంటుండడం వారి నెత్తిన పిడుగు పడ్డట్టవుతున్నది. డీఏపీ ధరలకు రెక్కలు వస్తే రైతాంగంపై పెనుభారం పడే ముప్పున్నది.

### డీఏపీ ధరల పెంపు!

వ్యవసాయం మొదలు పెట్టే సమయంలో డీఏపీ అత్యంత కీలకమైన ఎరువుగా రైతులు వినియోగిస్తారు. వరితోపాటు మిగిలిన అన్ని పంటలకు దాదాపుగా డీఏపీని ప్రారంభ దశలో వినియోగిస్తూ వస్తున్నారు. దీని ధర అధికంగానే ఉన్నప్పటికీ కేంద్రం సబ్సిడీపై డీఏపీని ఇస్తున్నది. వాస్తవంగా డీఏపీ 18-46-0 యాభై కిలోల బ్యాగు ధర ₹2,445.55గా ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ₹1095.55 సబ్సిడీ పోను ₹1350 నికర ధరకు అందిస్తున్నది. కేంద్రం మూడేండ్లుగా భారతీయ జన యూర్వరిక్ పరియో




జన పథకంలో భాగంగా ఇదే ధర, సబ్సిడీని కొనసాగిస్తూ వస్తున్నది. అయితే, కొత్త యేడాది ప్రారంభం నుంచి డీఏపీ ధర పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు బ్యాగును ₹1650కి విక్రయించాలని డీలర్లకు ముందస్తు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. అయితే కేంద్రమే ధరలు పెంచిందా..? లేక సబ్సిడీలో మార్పు వచ్చిందా..? అన్న వివరాలు ఇంకా పూర్తిగా తెలియడం లేదని డీలర్లు, అధికారులు వాపోతున్నారు. డీలర్ల వద్ద ప్రస్తుతం ఉన్న స్టాక్‌ను ఏడాది చివరి వరకు ₹1350కి విక్రయించి, తర్వాత రేట్లు పెంచి విక్రయించే అవకాశాలున్నాయని డీలర్లు చెబుతున్నారు.

### రైతులపై పెనుభారం

వ్యవసాయానికి పెట్టింది పేరుగా నిలుస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వానకాలం దాదాపు 8 లక్షలకుపైగా ఎకరాల్లో పంటలు సాగు చేసిన రైతులు, ఈ యాసంగిలోనూ అదే తీరున సాగుకు సిద్ధమవుతున్నారు. వరితోపాటు మక్క, నువ్వు లాంటి పంటలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 1.30 లక్షల టన్నుల వినియోగం జరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్, ఇతర ఏజెన్సీల్లో డీఏపీ నిల్వలు ఉన్నట్టు పేర్కొంటున్నా.. వాస్తవికంగా పెద్ద మొత్తంలో నిల్వలు లేవని చెబుతున్నారు. డీలర్లు, ఏజెన్సీల నిర్వాహకులు సరైన విధానాల్లో లెక్కలు సమర్పించలేదని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతమున్న అవసరాలరీత్యా పరిశీలిస్తే కేంద్రం నుంచి పెద్ద మొత్తంలోనే డీఏపీ సబ్సిడీ ఎరువును తెప్పించుకోవాల్సి వస్తుందంటున్నారు. 50 కిలోలకు ₹300 చొప్పున పెంచితే క్వింటాల్‌కు ₹600 చొప్పున దాదాపు ₹78 కోట్ల నుంచి ₹80 కోట్ల అదనపు భారం రైతులపై పడొచ్చని అంచనా వేస్తున్నారు. తీవ్రమైన ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న రైతులకు డీఏపీ ధర పెంపు మరింత భారమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. కాగా, ధర పెరుగుదలపై జగిత్యాల జిల్లా వ్యవసాయాధికారి రామచంద్రంతో మాట్లాడగా, ధర పెరుగుతుందని చెబుతున్నారే తప్ప.. ఇంత వరకు తమకు ఎలాంటి ఆదేశాలూ రాలేదని సమాధానమిచ్చారు.

### విత్తన ధరలూ భారమే

ప్రైవేట్ రంగ సంస్థల కంటే ప్రభుత్వ రంగ సంస్థే అధిక ధరకు విత్తనాలను విక్రయిస్తున్నది. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ.. సహకార సంఘాలు, ఆగ్రోస్ ద్వారా 25 కిలోల దొడ్డురకం విత్తనాల బ్యాగును ₹995 చొప్పున విక్రయించింది. సన్నరకం విత్తనాలను ₹1005కు అమ్మింది. అయితే, బయట మార్కెట్‌లో ఇవే విత్తనాలు ఇంత కంటే తక్కువ ధరకు దొరుకుతున్నాయి. దొడ్డురకానికి చెందిన 25 కిలోల విత్తన సంచి బయటి మార్కెట్‌లో ₹895కు, సన్నరకాలు ₹905కు అమ్ముతున్నారు. ప్రైవేట్ కంటే అధిక ధర ఉండడంపై రైతులు ఆగ్రహిస్తున్నారు. గతేడాది కంటే ఈ యేడాది విత్తనాల ధర పెరగడంతో అదనపు భారం పడుతుండగా, ఇలా ధరలు పెంచుకుంటూ పోతే సాగు చేసేదెలా అని ప్రశ్నిస్తున్నారు.

## కలెక్టరమ్మా.. నీ కాల్మొక్తం!

- పోలీసుల వేధింపుల నుంచి కాపాడండి
- 'ప్రజావాణి'లో మొకరిల్లిన బాధిత కుటుంబం


తమను కాపాడాలంటూ కలెక్టర్‌కు చేతులు జోడించి వేడుకుంటున్న బాధితులు

కరీంనగర్ కలెక్టరేట్, డిసెంబర్ 30 : 'అమ్మా.. నీ కాల్మొక్తం. రెవెన్యూ, పోలీసు అధికారుల కుట్రలకు మేం ఆగమైతున్నం. నా పిల్లలపై అన్యాయంగా తప్పుడు కేసు పెట్టిన్రు. శారీరకంగా హింసించి, జైలుకు పంపిన్రు. నా భూమిని అక్రమంగా లాక్కునే ప్రయత్నాలను నా పిల్లలు అడ్డుకుంటే, వారిని చంపుతామని పోలీసోళ్లు బెదిరిస్తన్రు. వారి నుంచి మా కుటుంబాన్ని కాపాడి, మా భూమికి రక్షణ కల్పించండి' అంటూ ఓ వయోవృద్ధురాలు చేతులు జోడించి 'ప్రజావాణి'లో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతిని వేడుకున్నది. ఇప్పటికీ పదకొండు సార్లు కలెక్టర్‌ను కలిశామని, ఆరు సార్లు పోలీస్ కమిషనర్‌ను కలిశామని, అయినా తమకు న్యాయం జరగడం లేదని వాపోయింది. తమ భూమి కబ్జా చేసేందుకు ఏనుగు జయపాల్‌రెడ్డి పోలీసులను కట్టిపెట్టుకున్నాడని, తమను మట్టుబెట్టేందుకు కూడా వెనుకాడడంటూ భయాందోళన వ్యక్తం చేసింది. దీంతో కలెక్టర్ చలించిపోయారు. ఈ విషయాన్ని పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధితురాలి మాటల్లో.. ' నా పేరు కాటిపల్లి లక్ష్మి. మాది జమ్మికుంట పట్టణ పరిధిలోని కొత్తపల్లి. నాకు ధర్మారం శివారులోని 465/బీ సర్వే నెంబర్‌లో 6 గుంటల భూమి ఉన్నది. ఆ భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి తప్పుడు రికార్డులతో ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు. అప్పుడు నా కొడుకు రాజు, కూతురు స్వరూప కలిసి అడ్డుకున్నరు. ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన్రు. అయితే జయపాల్‌రెడ్డి మాపైనే జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిండు. పోలీసులు నా పిల్లల్ని పిలిచి కొట్టి, జైలుకు పంపిన్రు. నా పిల్లలు కండిషన్ బెయిలుపై వస్తే మళ్లీ జైలుకు పంపుతామంటూ పోలీసులు బెదిరిస్తున్నరు. సదయ్య అనే కానిస్టేబుల్ ఇంటికి వచ్చి భయపెడుతున్నడు. వారి భయానికి మా ఆస్తులు వదిలి, ఊరు విడిచి పోవాలనే నిర్ణయానికి వచ్చినం' అని కంటతడి పెట్టింది. గతంలో హుజూరాబాద్ ఆర్డీవో విచారణ జరిపినా నివేదిక ఇప్పటివరకు ఇవ్వలేదని, ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదని వాపోయింది. పూర్తి స్థాయిలో విచారణ చేసి తమకు న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరింది.


నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

## చేతులకు సంకెళ్లతో నిరసన

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 30 : తెలంగాణ సమగ్ర శిక్షాలో వెట్టి చాకిరీ చేస్తూ జీవనం సాగిస్తున్న తమ బానిస సంకెళ్లు తెంపి ఉద్యోగాలను సీఎం రేవంత్‌రెడ్డి రెగ్యులర్ చేయాలని కోరుతూ ఉద్యోగులు సోమవారం చేతులకు సంకెళ్లు వేసుకుని వినూత్న నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె 21 రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చాలీచాలని వేతనంతో అత్యంత దుర్భర పరిస్థితుల్లో జీవనం గడుపుతున్నారని, వారి ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పే స్కేల్ ప్రకటిస్తే వృత్తి నిర్వహణలో ప్రభుత్వానికి, ఇటు ఉపాధ్యాయులకు మధ్య వారధిగా ఉంటూ అంకితభావంతో పనిచేస్తామని చెప్పారు.

## చివరి ఆయకట్టు వరకూ నీళ్లివ్వాలి

ముస్తాబాద్ తహసీల్దార్‌కు తెర్లుమద్ది రైతుల వినతి


నీటిని విడదల చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు

ముస్తాబాద్, డిసెంబర్ 30 : ఎగువమానేరు ప్రాజెక్ట్ చివరి ఆయకట్టు తెర్లుమద్ది వరకు నీటిని విడుదల చేయాలని గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ముస్తాబాద్ తహసీల్దార్‌కు వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు శీలం స్వామి మాట్లాడుతూ, గత ప్రభుత్వం మండుటెండల్లోనూ గోదావరి నీళ్లతో గ్రామాల్లోని చెరువు కుంటలను నింపి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించిందని, అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల మాట దేవుడెరుగు కానీ, చెరువులో నీరున్నా అందించడంలేదని వాపోయారు. యాసంగి పంటకు నీరు వస్తుందని చివరి ఆయకట్టు రైతులు బోరు బావుల వద్ద నార్లుపోసి నాట్లు వేస్తున్న సమయంలో 18వ డిస్ట్రిబ్యూటరీ (కొంత పోతుగల్ వరకు) వరకే నీరందిస్తామని చెప్పారని వాపోయారు. తెర్లుమద్ది వరకు (22వ డిస్ట్రిబ్యూటరీ) వరకు నీళ్లివ్వాలని, లేకుంటే రేవంత్‌రెడ్డి సర్కార్‌కు వ్యతిరేకంగా ముస్తాబాద్ నుంచి రైతు ఉద్యమం ప్రారంభమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు అక్కపెల్లి నారాయణ, సుంచు దేవయ్య, చెవుల బాలెల్లు, జంగం పెద్దులు, లోకం శ్రీను, బాలయ్య, రాజయ్య, బాబు, నర్సింలు, ఎడ్ల రాజు, పెద్దూరి యాదగిరి, లక్కిరెడ్డి యాదగిరి, బిట్ల రవి, లింగం, నారాయణ, బాలరాజు, పాల్గొన్నారు.



## న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు

నేడు తీగల వంతెన, డ్యాం కట్టపైకి నిషేధం

రాంనగర్, డిసెంబర్ 30 : న్యూ ఇయర్ వేడుకలపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రజలంతా శాంతియుత వాతావరణంలో సంబురాలు చేసుకోవాలని సూచిస్తూనే, అదే సమయంలో వేడుకల పేరిట హద్దు దాటి ప్రవర్తిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరిస్తున్నారు. నిరంతర డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తామని, స్పెషల్ యాక్షన్ టీంలు నేటి సాయంత్రం నుంచే రంగంలోకి దిగుతాయని చెప్పారు. అర్ధరాత్రి రోడ్లపైకి వచ్చే హంగామా చేసే వారిపై కఠినంగా వ్యవహరించడమే కాక కేసులు పెట్టేందుకు సిద్ధమయ్యారు. కాగా, మంగళవారం సాయంత్రం 6 నుంచి బుధవారం ఉదయం 5 గంటల వరకు నగర శివారులోని తీగల వంతెన, లోయర్ మానేరు డ్యాం కట్టపైకి వెళ్లేందుకు అనుమతించబోమని, అక్కడ వేడుకల నిర్వహణను నిషేధించినట్టు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో తెలిపారు.

# బయోమైనింగ్‌కు బ్రేక్


### కరీం'నగరం'లో అటకెక్కిన చెత్తశుద్ధి ప్రక్రియ


డంప్ యార్డులో ఏర్పాటు చేసిన బయోమైనింగ్ యంత్రం

- డంప్‌యార్డులో మధ్యలోనే నిలిచిన పనులు
- కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడమే కారణం!
- కుప్పలు తెప్పలుగా పేరుకుంటున్న వేస్టేజీ
- తరచూ అగ్నిప్రమాదాలు.. చెలరేగుతున్న మంటలు
- పొగ, వాసనతో శివారు ప్రజలకు అవస్థలు

**చెత్తశుద్ధి కరువైంది. కరీం'నగరం'లో ప్రధాన సమస్యగా మారిన డంప్‌యార్డులో బయోమైనింగ్‌కు బ్రేక్ పడింది. ఆటోనగర్ సమీపంలో గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన వేస్టేజీని తొలగించేందుకు గత బీఆర్ఎస్ సర్కారు ₹16కోట్ల వ్యయంతో శ్రీకారం చుట్టిన చెత్త క్లీనింగ్ ప్రక్రియ అటకెక్కింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడమే అందుకు కారణమని తెలుస్తుండగా, తరచూ అగ్ని ప్రమాదాలు జరిగి వెలువడుతున్న పొగ వాయు కాలుష్యానికి దారి తీస్తున్నది. ఫలితంగా శివారు కాలనీల జనం ఇబ్బందులు పడుతుండగా, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నది.**

కార్పొరేషన్, డిసెంబర్ 30 : కరీం'నగర' శివారులోని ఆటోనగర్ సమీపంలో తొమ్మిదెకరాల విస్తీర్ణంలో ఉన్న డంప్‌యార్డుల్లో చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన విషయం తెలిసిందే. దీని వల్ల ఏటా వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగడం, ఫలితంగా కాలుష్యం కావడంతోపాటు వచ్చే పొగ మూలంగా సమీపంలోని కాలనీల ప్రజలందరూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాగా, ఈ సమస్యలన్నింటికీ బయోమైనింగ్ ప్లాంట్ల ద్వారా శాశ్వత పరిష్కారం చూపించాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. వచ్చే రెండేండ్లలో బయోమైనింగ్ పద్ధతిలో డంప్‌యార్డులోని చెత్తను క్లీన్ చేయడంతో ఎరువులు తయారు చేయాలని సంకల్పించారు. అలాగే ఈ స్థలాన్ని ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా అద్భుతంగా తీర్చిదిద్దాలని భావించారు. ఈ క్రమంలో సుమారుగా ₹16 కోట్ల వ్యయంతో బయోమైనింగ్ చేపట్టేందుకు టెండర్లు పిలిచి, హైదరాబాద్‌కు చెందిన సంస్థకు అప్పగించారు. చెత్తను క్లీన్ చేసేందుకు రెండు ప్లాంట్లను ఏర్పాటు చేసి పనులు చేస్తామని పేర్కొన్న సంస్థ ప్రతినిధులు, రెండేళ్ల క్రితం ఒక ప్లాంట్‌ను ఏర్పాటు చేసి పనులు ప్రారంభించారు. కానీ కొద్దిరోజులకే పనులు ఆగిపోయాయి. అయితే చేపట్టిన పనులకు గాను పూర్తిస్థాయి బిల్లుల చెల్లించాలని సంబంధిత కాంట్రాక్టు సంస్థ పేర్కొంటుండగా, నగర పాలక సంస్థ పట్టించుకోకపోవడం వల్లే చెత్తశుద్ధి ప్రక్రియ నిలిచిపోయినట్లు తెలుస్తున్నది. కాగా, పనులు చేయని కారణంగా ఇటీవల నగర కమిషనర్ సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. మరి మరోసారి బయోమైనింగ్ ప్రారంభమై డంప్ యార్డు సమస్యకు పరిష్కారం లభిస్తుందా..? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



### తరచూ మంటలు.. దట్టమైన పొగలు

బయోమైనింగ్ ప్రక్రియ అటకెక్కగా, డంప్‌యార్డులో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతూ, రోజుల తరబడి పొగ నగరాన్ని కమ్మేస్తున్నది. క్రమంగా వాయు కాలుష్యానికి దారి తీస్తుండడం, దుర్వాసన వస్తుండడంతో చుట్టు పక్కల కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్ రహదారిపై వెళ్లే వాహనదారులు పొగతో నరకం చూస్తున్నారు. రెండ్రోజుల క్రితం భారీగా మంటలు ఎగిసిపడడంతో స్థానిక ప్రజలు భయపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


అందజేసిన సైకిళ్లతో విద్యార్థులు

## పేద పిల్లలకు సైకిళ్లు

ఫేస్‌బుక్ మిత్రుల ఔదార్యంతో 50 మందికి పంపిణీ

ధర్మపురి, డిసెంబర్ 30: గ్రామీణ ప్రాంతాల పిల్లల కోసం ఫేస్‌బుక్ మిత్రులు ఔదార్యం చూపారు. 50 మంది పేద విద్యార్థులకు ₹2.50 లక్షల విలువైన సైకిళ్లను కొనుగోలు చేసి అందించారు. వివరాల ప్రకారం.. గ్రామీణ ప్రాంతాల నుంచి ధర్మపురి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేందుకు వస్తున్న పేద విద్యార్థులకు సైకిళ్లను అందించాలని ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేనికుంట రమేశ్ సంకల్పించాడు. ఆ మేరకు పిల్లలకు సైకిళ్లను అందిద్దామని, దాతలు సహకరించాలని ఈ నెల 3న ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. దాంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు స్పందించారు. రమేశ్ ఖాతాలో ₹2.50లక్షలు జమచేశారు. ఆ డబ్బులతో రమేశ్ 50 సైకిళ్లను కొనుగోలు చేశాడు. సోమవారం ధర్మపురి న్యూటీటీడీ కల్యాణ మండపంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి, ధర్మపురి సీఐ చేతుల మీదుగా అందజేశాడు. ఈ సందర్భంగా రమేశ్‌ను సీఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సీతాలక్ష్మి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఎల్ఐసీ బ్రాంచ్‌మేనేజర్ శుభాకర్ పాల్గొన్నారు.

## హత్య కేసులో ఒకరికి యావజ్జీవ జైలు

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 30: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిని కత్తితో పొడిచి హత్య చేసిన బెల్లాల అలియాస్ పల్లె పోశెట్టికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే..ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన బర్లపాటి రాజేశ్వర్, అదే గ్రామానికి చెందిన బెల్లాల అలియాస్ పల్లె పోశెట్టి మధ్య వివాదాలు ఉండేవి. రాజేశ్వర్‌పై పోశెట్టి కక్ష పెంచుకున్నాడు. 2021 ఫిబ్రవరి 24న ఒంటరిగా ఉన్న రాజేశ్వర్‌పై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యాడు. దవాఖానకు తీసుకెళ్తుండగా, మార్గంమధ్యలోనే రాజేశ్వర్ మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని విచారించిన పోలీసులు, కోర్టులో సాక్ష్యాలు ప్రవేశపెట్టారు. పీపీ మల్లికార్జున్ కేసు వాదించి నేరాన్ని రుజువు చేయడంతో పోశెట్టికి జీవిత ఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. నేరస్తుడికి శిక్ష పడేలా చేసిన సీఐ ఎల్. శ్రీను, ఎస్ఐ వెంకట్‌రావు, కోర్టు కానిస్టేబుల్ రంజిత్, లైజనింగ్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్‌ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.


కోరుట్లలో జాతీయ రహదారి పక్కన పుట్‌పాత్‌పై ఉంచిన సామగ్రి

## పుట్‌పాత్‌లు ఆక్రమించి..

కోరుట్లలో వ్యాపారుల ఇష్టారాజ్యం


పుట్‌పాత్, రహదారిపై వాహనాలు

కోరుట్ల, డిసెంబర్ 30 : కోరుట్ల పట్టణంలో కొందరు వ్యాపారులు పుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని మెట్‌పల్లి రోడ్డు వ్యవసాయ మార్కెట్ నుంచి పట్టణ శివారు జగిత్యాల రోడ్డు శ్రీకృష్ణ మందిరం వరకు జాతీయ రహదారిని ఆనుకొని లక్షలాది రూపాయలు వెచ్చించి బాటసారులు నడిచేందుకు నిర్మించిన పుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్నారు. దుకాణ సామగ్రిని యథేచ్ఛగా వాటిపై పెట్టి, తమ వాహనాలను రహదారులపై నిలుపుతున్నారు. దీనికి తోడు పుట్‌పాత్‌లపై నిర్మాణాలు చేపట్టి జాతీయ రహదారిపై సైన్ బోర్డులు, ఇతర సామగ్రి పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు.